సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



ఎగువమానేరుకు పరుగులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మల్లన్నసాగర్ జలాలు నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు వైపు పరుగులు తీస్తున్నాయి. సోమవారం కూడవెల్లి వాగులోకి చేరాయి.



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో సోమవారం రద్దీ నెలకొంది. వేలాదిగా తరలివచ్చి దర్శించుకున్నారు. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/22.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అబుదాబిలో 65 వేల మందితో ప్రధాని సభ

- ఐపీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అబుదాబిలోని షేక్ జహేద్ స్పోర్ట్ స్టేడియంలో ఫిబ్రవరి 13వ తేదీన 65వేల మంది భారతీయులతో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ పీపుల్స్ ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కుంబాల మహేందర్‌రెడ్డి తెలిపారు. బహిరంగ సభ జరిగే స్టేడియం, రిజిస్ట్రేషన్ పనులను సోమవారం పరిశీలించి మాట్లాడారు. దుబాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకుపోతామన్నారు. వలసకార్మికుల కోసం ప్రత్యేక చట్టాలను అమలు చేసేలా చూడాలని కోరుతామన్నారు. ఐపీఎఫ్ యూఏఈ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీపిక, శ్రీనివాస్, వంశీగౌడ్, నవనీత్, అశోక్, శరత్‌గౌడ్, యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్‌లో హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లను తొలగిస్తున్న జేసీబీ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని రాజన్నగొల్లపల్లి శివారులో అనుమతి లేకుండా కొనసాగిస్తున్న వెంచర్‌లో హద్దురాళ్లను తొలగించారు. గ్రామంలోని సర్వేనంబర్ 524 /బిలోని 2.10 ఎకరాల భూమిలో అనుమతులు లేకుండా ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎంపీవో జోగం రాజు, ఏవో, గ్రామ ప్రత్యేకాధికారి వెంకట్రామమ్మ అక్కడికి చేరుకొని వెంచర్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించారు. ప్లాట్ల నిర్వాహకులకు నోటీసులు పంపించారు. గ్రామంలో అనుమతులు లేకుండా ప్లాట్లుగా చేసి విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శి దయాకర్ తదితరులు ఉన్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన

- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ గంభీరావుపేటలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై బైఠాయించి, సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణశాఖ అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, పెద్దవేని వెంకటియాదవ్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్లు దయాకర్‌రావు, మాజీ వైస్‌చైర్మన్ లింగంయాదవ్, సంపూర్ణ, మాజీ ఎంపీటీసీ కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతర్లకు పటిష్ట ఏర్పాట్లు

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళ




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: మానేరు తీరాన మాఘ అమావాస్య రోజున జరిగే మూడు జాతర్లకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సోమవారం గంగాభవాని, మడేలేశ్వర, రామలింగేశ్వర స్వామి ఆలయాలు, జాతర్లు జరిగే ప్రాంతాలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఆయా జాతర్లకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రజకసంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చింతకుంట శ్రీనివాస్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప సత్యనారాయణ, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంపీ సీటు.. చాలా హాటు!

- కాంగ్రెస్‌లో పోటాపోటీ దరఖాస్తులు
- ఇప్పటికే 10 వరకు అప్లికేషన్లు
- టికెట్ కోసం ఎవరికి వారే ప్రయత్నాలు
- పార్టీకి చేసిన సేవ.. తమ నేపథ్యం చూడాలంటూ వినతిపత్రాలు
- అధికార పార్టీలోనే ఖరారు కాని అభ్యర్థి
- బీజేపీ, బీఆర్‌ఎస్‌లలో బలమైన అభ్యర్థులు
- అధిష్టానం చూపు జీవన్‌రెడ్డి వైపు



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్ ఎంపీ సీటు కాంగ్రెస్ పార్టీలో చాలా హాటుగా మారింది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం.. అసెంబ్లీ ఫలితాలు వెలువడి రెండు నెలలే అవుతుండడంతో కార్యకర్తలు, నాయకులు అదే జోష్‌లో ఉన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినట్లుగానే.. కరీంనగర్ ఎంపీ స్థానాన్ని సైతం కైవసం చేసుకునేందుకు పలువురు ఆశావహులు ఉత్సాహంగా ఉన్నారు. పార్లమెంట్ అభ్యర్థులు పోటీ చేసేందుకు ఆశావహుల నుంచి దరఖాస్తులు కోరగా.. కరీంనగర్ ఎంపీ సీటు కోసం దాదాపు పది మంది వరకు తమ పేరును పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తు చేసుకుంది వీరే..

కరీంనగర్ ఎంపీ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో.. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దివంగత మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు మేన్నేని రోహిత్‌రావు, మరో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు కుమారుడు వెలిచాల రాజేందర్‌రావుతోపాటు మాజీ సీఎం కేసీఆర్ అన్నకూతురు రేగులపాటి రమ్యరావు, ఎన్ఆర్ఐ సింగిరెడ్డి సుమనారెడ్డి, పాల్సాని స్నేహ, ఉప్పు రవీందర్, రుద్ర సంతోష్ గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించారు.

దరఖాస్తులు సమర్పించిన పది మంది

- కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించిన వారు పది మంది ఉన్నారు.
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానమైన హుస్నాబాద్‌ను ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వదిలేయడంతో ఎంపీ అభ్యర్థిత్వం తనకు ఖాయమని భావిస్తున్నట్లు సమాచారం.
- సహకార బ్యాంకు నేతగా, ఇఫ్కో డైరెక్టర్‌గా, మాజీ ఎమ్మెల్యేగా సౌమ్యుడిగా పేరొందిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తనదైన శైలిలో ఢిల్లీ స్థాయిలో పార్టీ టికెట్‌ను కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.
- మాజీ మంత్రి, సీనియర్ నేత ఎమ్మెస్సార్ మనుమడు మేన్నేని రోహిత్‌రావు రెండున్నరేళ్లుగా కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. తన తాత ఎమ్మెస్సార్‌కు ఉన్న సంబంధాలను ఢిల్లీ వరకు ఉపయోగించుకొని యువకుడినైన తనకు పార్టీ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తూ పార్టీ అధిష్టానంపై టికెట్ కోసం ఒత్తిడి తెస్తున్నారు.
- మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్‌కు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అనుకూలంగా ఉండడం, ఓర్పు, నేర్పు కాంగ్రెస్‌కు కలిస్తొందని, వివాదరహితుడిగా పేరొందిన సంతోష్‌కుమార్‌కు టికెట్ కేటాయించాలని ఆయన వర్గీయులు అధిష్టానానికి విన్నవిస్తున్నారు.
- మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, కేడీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతోపాటు క్షేత్రస్థాయిలో గుర్తింపు ఉంది. ప్రతిపక్షాల విమర్శలను చిత్తు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆవశ్యకతను వివరిస్తూ దూసుకెళ్లే మృత్యుంజయంకే పార్టీ ఎంపీ అభ్యర్థిత్వం ఇవ్వాలని కోరుతూ ఆయన వర్గీయులు గాంధీభవన్‌కు వెళ్లి దరఖాస్తు సమర్పించారు.
- మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు కుమారుడు రాజేందర్‌రావు దరఖాస్తు చేసుకున్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, తెలంగాణ ఫోరం చైర్మన్‌గా తన తండ్రి చేసిన కృషిని గుర్తించాలని కోరుతున్నారు. తాను 2009లో ప్రజారాజ్యం పార్టీ పక్షాన పోటీ చేశానని, జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన సంబంధాలు ఉన్నాయని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆర్థికసాయంతోపాటు పనిచేసిన విధానాన్ని పరిశీలించాలని కోరుతున్నట్లు తెలిసింది.
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు సైతం కరీంనగర్ ఎంపీ టికెట్‌పై కన్నేసినట్లు తెలిసింది.
- మాజీ సీఎం కేసీఆర్ అన్న కూతురు రేగులపాటి రమ్యరావు సైతం మహిళా కోటలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని పార్టీ అధిష్టానానికి విన్నవించింది.
- ఎన్ఆర్ఐ సింగిరెడ్డి సుమనారెడ్డి, రుద్ర సంతోష్, పాల్సాని స్నేహ, ఉప్పు రవీందర్ పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకొని వారి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఏది ఏమైనా కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ గెలుపుతో ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్‌లను మట్టి కరిపించేలా ఫలితం రాబట్టాలనే ఎత్తుగడలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

జీవన్‌రెడ్డి వైపే అధిష్టానం మొగ్గు

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీజేపీ నుంచి ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కుమార్ హేమాహేమీలు కావడంతో కాంగ్రెస్ పార్టీ సమ ఉజ్జీ అయిన అభ్యర్థిగా జీవన్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉండడం, ఒకసారి మంత్రిగా, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగడమే కాకుండా గతంలో తెలంగాణ ఉద్యమనేత, మాజీ సీఎం కేసీఆర్‌తో రెండుసార్లు కరీంనగర్ పార్లమెంట్‌కు పోటీ చేసిన అనుభవాన్ని పార్టీ అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటున్నట్లు వినికిడి. ఉద్యమ సమయంలో కేసీఆర్‌పై మొదటిసారి జీవన్‌రెడ్డి పోటీచేసి 2 లక్షల పై చిలుకు ఓట్లతో ఓటమి పొందడం, రెండోసారి పోటీ చేసి కేవలం 16 వేల ఓట్లతో ఓడిపోవడం వంటి విషయాలను కాంగ్రెస్ పార్టీ మెరిట్‌గా తీసుకొని కరీంనగర్ లోక్‌సభ నుంచి జీవన్‌రెడ్డిని బరిలో నిలపాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. లోక్‌సభ పరిధిలో బలమైన రెడ్డి సామాజికవర్గం ఉండటం, నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో అనుభవం ఉండడంతో బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు దీటైన పోటీ ఇచ్చేది జీవన్‌రెడ్డియేనని అధిష్టానం నమ్ముతున్నట్లు సమాచారం. మరో పక్క జీవన్‌రెడ్డి కూడా పోటీకి ఉత్సాహంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవీకాలం కూడా త్వరలోనే పూర్తికానుండడంతో ఎంపీగా పోటీకి సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు వినికిడి. ఓ వైపు బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నియోజకవర్గాల వారీగా సమావేశాలు పెడుతుంటే.. కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థి ఎవరనేది కొలిక్కిరాలేదు. అధికార పార్టీ అభ్యర్థి తేల్చితే కాంగ్రెస్ పార్టీ విజయం నల్లేరుమీద నడకే అన్నట్లుగా అవుతుందని భావిస్తున్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రజావాణికి 36 దరఖాస్తులు

సిరిసిల్లటౌన్: ప్రజావాణికి వచ్చే అన్ని దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌లతో కలిసి సోమవారం ప్రజావాణి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వాణిలో వచ్చే అర్జీలలో పెండింగ్ ఉండకూడదని సూచించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను శాఖల వారీగా అధికారులకు సూచిస్తూ.. సత్వరమే పరిష్కరించాలన్నారు.

36 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 36 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 22, డీపీవో 3, సిరిసిల్ల మున్సిపల్ 2, హౌసింగ్ 2, ఎంప్లాయిమెంట్ 2, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, వేములవాడరూరల్, ఎంపీడీవో కార్యాలయాలు, ఎక్సైజ్‌శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, ఎస్డీసీ గంగయ్య, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పనులు పూర్తిచేయాలి



రంగనాయకసాగర్ ఎడమకాల్వ వెంటనే పూర్తిచేయాలి. సదరు కాల్వ ద్వారా సిద్దిపేటలోని విఠలాపురం, సిరిసిల్లలోని దాచారం, చిన్నలింగాపూర్, నర్సింహులుపల్లె, బాలుమాలుపల్లెకు నీటి లభ్యత ఉంటుంది. కాల్వ పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల్లోని పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. విఠలాపురం రైతు పొలం నుంచి కెనాలు రావాల్సి ఉండగా..అతనికి పరిహారం రాకపోవడంతో అడ్డుకుంటున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– బైరినేని రాము, చిన్నలింగాపూర్ ఎంపీటీసీ

ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రత్యేకాధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. జిల్లాలోని ప్రత్యేకాధికారులకు సోమవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రత్యేకాధికారులుగా గ్రామాలను అభివృద్ధి చేసే అవకాశం లభించిందని, ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. నీటి ట్యాంకులకు నీరు వస్తుందా.. ప్రతి ఇంటికీ నీరు సరఫరా అవుతుందా.. లేదో చూడాలన్నారు. ఊరిలో చెత్త సేకరణ, ట్రాక్టర్‌లో తరలింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధిదీపాలు వెలిగేలా చూడాలన్నారు. నీటి సమస్య పరిష్కారానికి 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించాలన్నారు. వందశాతం పన్ను వసూళ్లు సాధించాలని తెలిపారు. ప్రత్యేకాధికారుల విధులు, బాధ్యతలను జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్ వివరించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) మొదటి స్థాయి తనిఖీని కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల శివారులోని సర్దాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో చేపడుతున్న ఈవీఎంల తనిఖీలను పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ నేరం

- పిల్లలకు వాహనాలు ఇస్తే పెద్దలపై కేసు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: పిల్లలకు వాహనాలు ఇవ్వడంతోనే ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, బంగారు భవిష్యత్ ఉన్న పిల్లలు బలికావాల్సి వస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల గురించి జిల్లాలో అన్ని పాఠశాలల్లో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రాజన్న దారిలో..



వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో వేములవాడ రాజన్న దర్శనానికి సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క-సారక్కలను దర్శించుకునే భక్తులు ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. దీంతో భక్తుల రద్దీ పెరిగిపోతుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు ఆర్జిత సేవలు రద్దు చేశారు. తలనీలాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గంజాయి రహిత జిల్లాగా మార్చుదాం

- మాదకద్రవ్యాలను నియంత్రించాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రాజీవ్‌నగర్‌లో డీ–అడిక్షన్ సెంటర్ ప్రారంభం



రాజీవ్‌నగర్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్లను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ బస్తీ దవాఖానాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'డీ–అడిక్షన్' కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో గంజాయి, మాధక ద్రవ్యాలను కట్టడి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. యువత గంజాయి, మత్తుపదార్థాల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణను అందరూ సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ పోలీస్ యంత్రాంగం శాంతి భద్రతలతోపాటు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకుంటుందన్నారు. మరో అడుగు ముందుకు వేసి జిల్లా పోలీసులు మాధకద్రవ్యాలకు అలవాటు పడిన వారిని సన్మార్గంలో నడిపించడానికి డాక్టర్ల సహకారంతో ఆపరేషన్ విముక్తి పేరుతో 'డీ–అడిక్షన్' సెంటర్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో పిల్లల తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు. దీని కోసం పోలీస్‌శాఖకు తమ వంతు సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ రేపటి భవిష్యత్‌కు పునాది అయిన పౌరులు మాధకద్రవ్యాలకు బానిసలు కాకుండా కాపాడే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గంజాయి, మాధకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాధకద్రవ్యాలతో కలిగే అనర్థాల గురించి జిల్లాలో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. 'డీ–అడిక్షన్' సెంటర్‌లో సైకాలజిస్ట్, సైకియాట్రిస్ట్ డాక్టర్స్‌తో కౌన్సెలింగ్‌తో పాటు వైద్యసేవలు అందుతాయని తెలిపారు.

డీ–అడిక్షన్ కేంద్రంలో...

ఈ కేంద్రంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు సైకాలజిస్ట్, సైక్రియాట్రిస్టులతో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, మత్తుపదార్థాలకు బానిసలు మారిన వారు త్వరగా కోలుకునేలా అవసరమైన మెడిసిన్ ఉచితంగా అందిస్తారని తెలిపారు. 'డీ–అడిక్షన్' సెంటర్‌లో కౌన్సిలింగ్‌లో పాల్గొన్నా.. మార్పు రాని వారిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి పూర్తిగా కోరుకునే వరకు అవసరమైన వసతి సౌకర్యాలు, ఆస్పత్రి ఖర్చులు వెచ్చించేలా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్ కోసం పేరు నమోదు, ఇతర సమాచారం కోసం మీ దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని 'మెసేజ్ యువర్ ఎస్పీ' వాట్సప్ నంబర్ 63039 22572 సమాచారం అందించాలన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు చీకోటి సంతోష్, సైక్రియాట్రిస్టులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సతీశ్, కౌన్సిలర్ పూర్ణచందర్, సిరిసిల్ల సీఐ రఘుపతి, కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయగౌడ్, చొప్పదండి ప్రకాశ్, గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, సూర దేవరాజు పాల్గొన్నారు.

పవర్‌లూం కార్మికులకు ఉపాధి కల్పించాలి

- ఎమ్మెల్యే కేటీఆర్ వెంటనే స్పందించాలి
- పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్ కార్మికులకు, వార్పిన్ ఆసాములు, అనుబంధ రంగాల కార్మికులకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని పార్టీ ఆఫీసులో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రెండు నెలలుగా సిరిసిల్ల వస్త్రపరిశ్రమ, అనుబంధ రంగాల కార్మికులకు పనుల్లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ముగిసిన వెంటనే యజమానులు పాలిస్టర్ మాంద్యం పేరుతో పనులు ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వ విధానాలే సిరిసిల్ల వస్త్రపరిశ్రమ పనుల కోసం ప్రభుత్వం వైపు చూడాల్సిన పరిస్థితికి వచ్చిందని విమర్శించారు. ఇప్పుడు సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత సిరిసిల్ల ఎమ్మెల్యేపై ఉన్నా.. ఆయన కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈనెల 7న సిరిసిల్లలోని చేనేత, జౌళిశాఖ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆసాముల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిరిసిల్ల రవి, చేరాల అశోక్, వార్పిన్ వర్కర్స్ గౌరవ అధ్యక్షుడు ఉడుత రవి, బూట్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇళ్ల పట్టాలు అందించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఆదివారం గృహప్రవేశం చేసిన నిరుపేద లబ్ధిదారులను ఇళ్లు ఖాళీచేయించవద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య కోరారు. సోమవారం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఖాళీ చేయించేందుకు వచ్చిన అధికారులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో గతంలోనే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ఎనిమిదేళ్లుగా వారు నిరీక్షిస్తున్నా అధికారికంగా ఇళ్లపట్టాలు అందించలేదన్నారు. దీంతో నిరుపేదలు గ్రామసభలో తమకు కేటాయించిన ఇళ్లలో గృహప్రవేశం చేశారన్నారు. అధికారికంగా కేటాయిస్తామని, ఖాళీ చేయాలని అధికారులు కోరడం సరికాదని, గృహప్రవేశం చేసిన వారికి ఇళ్ల పట్టాలు అందించాలని కోరారు.

జనపాల శంకరయ్యకు సన్మానం



సిరిసిల్లకల్చరల్: కవి, రచయిత, ఆధ్యాత్మికవేత్తగా పలురంగాల్లో సేవలందిస్తున్న డాక్టర్ జనపాల శంకరయ్యను పలు సంస్థలు సోమవారం సత్కరించాయి. సిరిసిల్ల సాహితీ సమితి, గీత ప్రచార సేవాసమితి, ఆల్ సీనియర్ సిటీజన్ల సంఘం ప్రతినిధులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కోడం నారాయణ, కట్టికోల లక్ష్మీనారాయణ, చేపూరి బుచ్చయ్య, పత్తిపాక హరికిషన్, గొరిశెట్టి ఆనందం, అంకారపు జ్ఞానోభ, గుడ్ల శ్రీధర్, తడుక శ్రీహరి, కోడం శంకర్, మేర్గు మల్లేశం పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: ఉపాధిహామీ పథకం రక్షించుకోవడానికి తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం చేపడుతున్న సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆవిష్కరించారు. సిరిసిల్ల కార్మికభవనంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉపాధి కూలీల సంక్షేమం కోరుతూ ఫిబ్రవరి 18న సిరిసిల్లలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సోమ నాగరాజు, పంతం రవి, మీసం లక్ష్మణ్, అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలించిన ఇద్దరి రిమాండ్

బోయినపల్లి(చొప్పదండి): మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న కేసులో వేములవాడకు చెందిన జితేందర్, అతని డ్రైవర్ తిరుపతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బోయినపల్లి ఎస్సై ఎల్.శ్రీకాంత్ సోమవారం తెలిపారు. రత్నంపేట పరిసరాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ట్రాక్టర్ యజమాని జితేందర్‌పై ఇప్పటికే 18 కేసులు, డ్రైవర్ తిరుపతిపై 5 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈక్రమంలో ఇసుక అక్రమ రవాణా నేరానికి అలవాటుపడ్డ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారాంతపు సంత ప్రారంభం

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని వన్‌పల్లిలో వారాంతపు సంతను గ్రామంలోని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి సోమవారం వారాంతపు సంత నిర్వహిస్తామన్నారు. రైతులు, కూరగాయల వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేయని పనులకు బిల్లులు !

- రోడ్డు విస్తరణ పనుల్లో చేతివాటం
- పనుల్లో తేడాపై 'సెస్' అధికారుల సీరియస్
- బ్లాక్ లిస్టులో విద్యుత్ కాంట్రాక్టర్
- రూ.8 లక్షల బిల్లులకు తిరస్కరణ
- కరెంట్ పనుల్లో అక్రమాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): చేయని పనులకు బిల్లులు కాజేద్దామనుకున్న వారికి చుక్కెదురైంది. రోడ్డు విస్తరణ పనుల్లో విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, లైన్ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకుండానే సెస్ నిధులకు ఎసరు పెట్టాలనే ప్రణాళికలు బెడిసికొట్టాయి. చేయని పనులకు బిల్లులు స్వాహా చేద్దామనుకోగా.. సెస్ అధికారుల అనుమానంతో అసలు నిజం వెలుగు చూసింది.

విచారణతో బయటపడ్డ అక్రమాలు

ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి తంగళ్లపల్లి మండలం రాళ్లపేట వరకు ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రూ.32.50 కోట్లతో చేపట్టిన ఈ పనుల్లో కరెంట్ స్తంభాల తొలగింపు, ఇతర విద్యుత్ పనులు సైతం చేపట్టారు. ఇందులో విద్యుత్ పనుల కింద లెబర్ చార్జీ, జీఎస్టీ కలుపుకొని రూ.29.79 లక్షల పనులు చేపట్టాల్సి ఉంది. మెటీరియల్ కింద రూ.9 లక్షల పనులను ముస్తాబాద్ నుంచి సేవాలాల్‌తండా వరకు 2018–19లో చేపట్టారు. ముస్తాబాద్ నుంచి పోతుగల్, గన్నెవారిపల్లె వరకు మాత్రమే అక్కడక్కడ పనులు చేశారు. పనులు పూర్తయినట్లు ఎంబీ రికార్డుకు వెళ్లగా.. అనుమానం వచ్చిన సెస్ అధికారులు విచారణ చేపట్టారు. సెస్ ఏఈ మహేశ్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి 25 రోజుల క్రితం సెస్ ఎండీకి నివేదిక సమర్పించారు. రూ.8లక్షల మెటీరియల్ బిల్లుల్లో తేడాలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. రూ.3లక్షల వరకే పనులు జరిగాయని అదనంగా ఎలాంటి పనులు చేపట్టలేదని నివేదికలో స్పష్టం చేశారు. ఈ బిల్లులను తక్షణమే నిలిపివేయాలని కోరారు. స్పందించిన సెస్ ఎండీ సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టి, బిల్లులు నిలిపివేశారు.



ముస్తాబాద్, పోతుగల్ మధ్య చేపట్టిన విద్యుత్ పనులు

పనులు ఇలా..

యాంగిల్ పాయింట్స్ రూట్ మ్యాప్‌లో 31.98 కిలోమీటర్లకు 4.5 కిలోమీటర్ల పనులు మాత్రమే జరిగాయని నివేదికలో పేర్కొన్నారు. దీనికి సదరు కాంట్రాక్టర్ రూ.15,990 బిల్లు పెట్టారు. హెచ్‌టీ లైను పనుల్లో 246 పోల్స్‌కు 13 మాత్రమే క్షేత్రస్థాయిలో ఉన్నాయి. దీనికి రూ.12.21లక్షల బిల్లు పెట్టారు. పీఎస్‌సీసీ పోల్స్‌లో 23కు 19 ఉన్నట్లు గుర్తించారు. క్రాస్ ఆర్మ్స్‌లో 79కి మూడు మాత్రమే ఉన్నాయి. ఇక ఫిక్సింగ్ ప్లేట్ అలైన్‌మెంట్లో 165కు 10 మాత్రమే ఉన్నాయి. ఫిక్సింగ్ క్లాంప్స్, పోల్ ఇరెక్షన్ పనుల్లో 24కు ఒకటి మాత్రమే ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఫార్మేషన్ సింగిల్‌పోల్ పనుల్లో 92కు 8 మాత్రమే ఉన్నాయని, దీనికి రూ.1.41లక్షల బిల్లులు వేసినట్లు గుర్తించారు. బ్యాక్ ఫిల్లింగ్ పిట్స్‌లో 40కి 15 ఉన్నాయని నివేదికలో చెప్పగా, రూ.1.08 లక్షల బిల్లులు వేసినట్లు గుర్తించారు. ఫార్మేషన్ ఎల్‌టీలైన్ పనుల్లో 160కిగాను 12 గుర్తించి రూ.1.06లక్షల చెల్లింపును నిలిపివేశారు. ఇలా మొత్తం 31 పనుల్లో అభ్యంతరాలు, అక్రమాలు జరిగాయని ఏఈ నివేదికలో స్పష్టం చేశారు. తీసుకున్న మెటీరియల్‌కు, జరిగిన పనుల్లో చాలా తేడాలు ఉన్నాయని పేర్కొన్నారు. రూ.5లక్షల వరకు పక్కదారి పట్టాయని స్పష్టం చేస్తూ నివేదిక ఇచ్చారు.

వెల్‌డన్... బాగా పని చేస్తున్నారు



వేములవాడ డాక్టర్ల బృందానికి కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందనలు

సిరిసిల్ల: 'వెల్‌డన్ బాగా.. పనిచేస్తున్నారు.. ఇదే స్ఫూర్తిని కొనసాగించండి..' అంటూ కలెక్టర్ అనురాగ్ జయంతి వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రి వైద్య బృందాన్ని అభినందించారు. రోగులకు అత్యుత్తమ, నాణ్యమైన వైద్యసేవలు అందించడం, ఆసుపత్రిలోని విభాగాల మెరుగైన నిర్వహణకు వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికెట్ ఇటీవల పొందింది. ఈ సందర్భంగా వేములవాడ ఆస్పత్రి వైద్యబృందంతో కలెక్టర్ ప్రత్యేకంగా సోమవారం సమావేశమై అభినందించారు. ఆస్పత్రిలో ఫార్మసీ, ఓపీడీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఆక్సిలరీ సర్వీసెస్, ఐపీడీ, ఓటీ, ల్యాబ్, మెటర్నిటీ వార్డులలో అందిస్తున్న సేవలకు ఎన్-క్వాస్ సర్టిఫికేషన్, లేబర్ రూమ్ మెరుగైన నిర్వహణకు లక్ష్య ప్రోగ్రామ్‌లో భాగంగా సర్టిఫికేషన్, పిడియాట్రిక్ విభాగంలో ఉత్తమ వైద్యసేవలు అందించినందుకు 'ముస్కాన్' సర్టిఫికేషన్ దక్కించుకుంది. కలెక్టర్ మాట్లాడుతూ ఈ అవార్డు బాధ్యతను పెంచిందని, ఇదే స్ఫూర్తితో ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన, అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఆర్.మహేశ్‌రావు, వైద్యులు అనిల్, సంతోష్‌చారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల కోసమే అమృత్ భారత్ రైల్వేస్టేషన్లు

- ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్ కోశాధికారి శంకర్‌రావు ధ్వజం
- హాజరైన ఐదు జిల్లాల మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు



శంకర్‌రావును సన్మానిస్తున్న రైల్వే ఉద్యోగులు

రామగుండం: రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఆర్‌ఎల్‌డీఏ) పేరిట వేలాది ఎకరాలు, రూ.కోట్లతో రైల్వేస్టేషన్లను అమృత్‌భారత్ రైల్వేస్టేషన్లుగా తీర్చిదిద్దుతున్న కేంద్రప్రభుత్వం.. వాటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందని ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్) కోశాధికారి, అనుబంధ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీహెచ్ శంకర్‌రావు ఆరోపించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆయన మజ్దూర్ యూనియన్ కార్యాలయం ప్రారంభించారు. ఏఐఆర్‌ఎఫ్ శతజయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కాజీపేట-కాగజ్‌నగర్-నిజామాబాద్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్ల నుంచి వందలాది మంది యూనియన్ నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పోరాటాల గడ్డగా పేరున్న రామగుండం నుంచి శతాబ్ది వేడుకలు ప్రారంభిస్తున్నామన్నారు. మీటరు గేజ్‌స్థాయి నుంచి ట్రిపుల్ లైన్ బ్రాడ్‌గేజ్ స్థాయి, ఎస్కలేటర్, వైఫై, షాపింగ్ మాల్స్ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతీరోజు 21వేల రైళ్లు, ప్రతీ ఐదు నిమిషాలకో రైలు రాకపోకలు సాగిస్తున్న స్థాయికి రైల్వే రంగం చేరినా.. ఉద్యోగుల సంఖ్య 15 లక్షల నుంచి పది లక్షలకు పడిపోవడం దురదృష్టకరమన్నారు. వీరిస్థానంలో కాంట్రాక్టు కార్మికులను భర్తీచేయడం శోచనీయమన్నారు. కోవిడ్ సమయంలో 3,800 మంది ఉద్యోగులు మృతి చెందినా.. కరోనా వారియర్స్‌గా గుర్తించకపోగా, పరిహారం కూడా చెల్లించలేదని ఆవేదన చెందారు. రామగుండం బ్రాంచి ప్రతినిధులు మెట్ట రామారావు, ఓవై స్వామి, వీరన్న, మోజెస్, ఆనంద్ రాథోడ్, అరవింద్, రజినీకాంత్, రవి, కేంద్ర ప్రతినిధులు ఖాజాబాబా, పిల్లలమర్రి రవీందర్, ఉదయ్‌భాస్కర్, కాల్వ శ్రీనివాస్, కర్ర యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు భరోసా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు



బస్సులో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న విప్

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు భరోసా కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని 145 బస్సుల్లో రెండు విడతల్లో సీసీ కెమెరాలను అమర్చి.. ప్రయాణికుల భద్రతకు భరోసానిచ్చిన ఎస్పీని అభినందించారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలు, విద్యార్థుల రక్షణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలోని ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు డిపో కార్యాలయానికి, జిల్లా పోలీస్ కార్యాలయానికి అనుసంధానించినట్లు వివరించారు. మహాశివరాత్రి భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వేములవాడలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వేములవాడలో ఏయే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనేదానిపై పరిశీలించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, డిపో మేనేజర్ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

బోయినపల్లి ఎంపీపీపై అవిశ్వాస నోటీస్

- 21న ప్రత్యేక సమావేశం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌పై ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు ఇచ్చిన అవిశ్వాసం వినతిపత్రం మేరకు ఈనెల 21న సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీవో మధుసూదన్ సోమవారం నోటీసులు జారీ చేశారు. గత నెల 27న ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ మండలంలోని వరదవెల్లి, మల్లాపూర్, అనంతపల్లి, కోరెం, తడగొండ, నర్సింగాపూర్ ఎంపీటీసీలు ఈడుగు రాజేశ్వరి, ఐరెడ్డి గీత, కంకనాల వనజ, డబ్బు మమత, ఉయ్యాల శ్రీనివాస్, కొనుకటి నాగయ్య వేములవాడ ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ వినతిపై ఆర్డీవో మధుసూదన్ ఈనెల 21న ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్‌లో సమావేశం ఏర్పాటుకు హాజరుకావాలని ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేశారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో అజాగ్రత్తగా లారీ నడుపుతూ ఒకరి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు, రూ.1200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. 2016 ఏడాదిలో జూన్ 27న దుమాలకు చెందిన దాయి భాస్కర్(26) మరొకరితో కలిసి స్కూటీపై వస్తుండగా, స్థానిక కొత్తబస్టాండ్ దగ్గర సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై వెనకాల నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భాస్కర్‌కు తీవ్రగాయాలై మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను తంగళపల్లి మండలం తాడూర్‌కు చెందిన జవ్వాజి ఆనందరావుగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన కోర్టు నిందితునికి జైలుతోపాటు రూ.1200 జరిమానా విధించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

మహిళకు మూడేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: వృద్ధురాలిని మాయమాటలతో మభ్యపెట్టి బంగారు గొలుసు కాజేసిన మహిళకు మూడేళ్ల జైలు శిక్ష ఖరారైంది. గతేడాది మే 9న ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన జంగటి లక్ష్మిని గంభీరావుపేటకు చెందిన పాటి సునీత మాటల్లో దించి బంగారు ఆభరణాలు తీసుకుని పరారైంది. కేసు నమోదు చేసిన పోలీసులు సునీతను రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాల ఆధారంగా నేరం నిరూపణ కావడంతో సిరిసిల్ల ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ నిందితురాలికి మూడేళ్ల జైలుతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు.

ఉద్యోగం పేరిట రూ.1.70లక్షలు స్వాహా

వీణవంక(హుజూరాబాద్): ఉద్యోగం పేరిట ఓ నిరుద్యోగిని నట్టేట ముంచిన ఘటన వీణవంక మండలం ఘన్ముక్కులలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్లూరి రాజు ఫోన్‌కు గత నెల 6న అమిటల్ మార్కెటింగ్‌లో జాబ్ ఆఫర్ ఉందని, ముందుగా కొంత పెట్టుబడి పెట్టాలని మెస్సేజ్ వచ్చింది. నమ్మిన అతను రూ.1.70లక్షలు అపరిచిత వ్యక్తికి పంపించాడు. ఆ తర్వాత జాబ్ రాకపోవడం, డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఫోన్‌లో అపరిచిత వ్యక్తులు లింక్‌లు పంపిస్తే ఓపెన్ చేయొద్దని సూచించారు.

కత్తితో బెదిరించి.. నగలు ఎత్తుకెళ్లి

- మంగళ్లపల్లిలో వృద్ధురాలి నగలు చోరీ



మంగళ్లపల్లిలో విచారణ చేపడుతున్న పోలీసులు

కోనరావుపేట(వేములవాడ): ఓ వృద్ధురాలిపై కత్తితో దాడికి ప్రయత్నించి బంగారు నగలు అపహరించుకుపోయిన సంఘటన కోనరావుపేట మండలం మంగళ్లపల్లిలో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలు. మంగళ్లపల్లిలో నంది సిద్ధవ్వ అనే వృద్ధరాలు సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి గొంతుపై కత్తిపెట్టి, నోరు మూశారు. ఒంటిమీద ఉన్న మూడు తులాల కమ్మలు, పుస్తెలతాడును లాక్కెళ్లారు. సిద్ధవ్వ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోగై వెతికినా దొంగల ఆచూకీ దొరకలేదు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని వృద్ధురాలు రోదిస్తూ తెలిపింది. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు గ్రామంలో విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు.

విద్యార్థులు పఠనాసక్తి పెంచుకోవాలి



పుస్తకాలు అందజేస్తున్న డీపీఆర్వో దశరథం

కోనరావుపేట(వేములవాడ): విద్యార్థులు పఠనాసక్తిని పెంచుకోవాలని డీపీఆర్వో మామిండ్ల దశరథం కోరారు. మండలంలోని కొలనూర్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం కోసం పూర్వ విద్యార్థులు పుస్తకాలు అందజేశారు. పాఠశాలలో 1995–96 విద్యాసంవత్సరంలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు నాంతాబాద్ చందూలాల్, మాజీ ఉపసర్పంచ్ ఓరుగంటి శంకర్, కట్కూరి సంతోష్, ఎగుర్ల తిరుపతి, సుద్దాల శ్రీనివాస్, మామిండ్ల దశరథం(డీపీఆర్వో) రూ.5వేల విలువైన పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు కోడూరి ఎల్లయ్య గౌడ్‌కు అందించారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పారితోషికం, మెమెంటోలు అందించారు. పదో తరగతిలో ప్రతిభ చూపే విద్యార్థులకు రూ.3,016 (ప్రథమ), రూ.2,016(ద్వితీయ), రూ.1,016 (తృతీయ), బహుమతులు అందిస్తామని తెలిపారు.

ఇళ్లు కట్టిస్తామని మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన భూపతిరాజు, మరికొందరు ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లె, మద్దికుంట, మోహినికుంట గ్రామాల్లో లబ్ధిదారుల వాటా కింద డబ్బులు వసూలు చేశారు. స్వచ్ఛంద సంస్థ పేరుతో ఇళ్లు నిర్మిస్తామని చెప్పి నిర్మించలేదన్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కేసీఆర్‌ను అవమానిస్తే సహించం



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న తోట ఆగయ్య

- చేతగాకుంటే పదవి దిగిపోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి తీరు శోచనీయం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సహించబోమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హెచ్చరించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి, ఇప్పుడు అమలు చేయలేని స్థితిలో ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై నోరు పారేసుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఆయన భాష వీధిరౌడీలా ఉందన్నారు. సీఎం హోదాను మరిచి మాట్లాడుతున్న వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారని దుయ్యబట్టారు. ఓటుకు నోటు కేసులో జైలుకెళ్లొచ్చిన రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ కాలిగోటికి సరిపోరన్నారు.

చేతగాకుంటే గద్దె దిగాలి

టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డికి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా లేకనే కేసీఆర్‌ను విమర్శిస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. పాలించడం చేతగాకపోతే గద్దె దిగాలని హితవు పలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కుంభాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న రుద్రంగి ఎస్సై అశోక్, పోలీసు సిబ్బంది

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన సుద్దాల భూమయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో కొండగట్టులో ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేకుండా ఎక్కువ రోజులు తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం భూమయ్య కూతురు వచ్చి చూడగా తాళం పగులగొట్టి, తలుపులు తెరిచి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న రుద్రంగి ఎస్సై అశోక్ పోలీసు సిబ్బందితో వెళ్లి భూమయ్య కూతురు నుంచి వివరాలు సేకరించారు. కొండగట్టులో ఉంటున్న భూమయ్య వస్తే ఎం పోయాయి.. అనే విరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

టైరు పగిలి.. చెట్టును ఢీకొట్టిన కారు



చెట్టును ఢీ కొట్టిన కారు

చందుర్తి(వేములవాడ): ప్రమాదవశాత్తు కారు టైరు పగిలి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురు ప్రయాణికులతోపాటు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన చందుర్తి మండలం ఎన్గల్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన వారు అద్దెకారులో వేములవాడ రాజన్న దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలోని చందుర్తి మండలం ఎన్గల్ శివారుకు చేరుకునే సరికి కారు టైరు పగలడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ సంజీవ్‌తోపాటు ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.